క్లుప్తంగా

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

కిర్లంపూడి: మండలంలోని జగపతినగరంలో వేంచేసిన అభయదుర్గమ్మ ఆలయ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. అర్చకులు బాదంపూడి వైద్యనాథం, సూరిబాబు శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి 11 రకాల అభిషేకాలు, కుంకుమార్చనలు నిర్వహించారు. అనంతరం నూతన వస్త్రాలు, పూలమాలలతో సుందరంగా అలంకరించారు. స్థానిక, పరిసర గ్రామాల భక్తులు అమ్మవారిని దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు ప్రసాదాలను వితరణ చేశారు.

మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం



తునిలో సీసీ రోడ్ల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే యనమల దివ్య

తుని: పట్టణంలో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ యనమల దివ్య అన్నారు. ఆదివారం ఉప్పరగూడెం కొత్త కాలనీలో రూ.80 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను ఆమె ప్రారంభించారు. దశల వారీగా అన్ని ప్రాంతాల్లోనూ రోడ్లు, కాలువలను నిర్మిస్తామన్నారు. ఇన్‌చార్జి మున్సిపల్ చైర్‌పర్సన్ కుచ్చర్లపాటి రూపాదేవి, మాజీ మున్సిపల్ చైర్మన్లు ఇనుగంటి సత్యానారాయణ, కుసుమంచి శోభారాణి, మున్సిపల్ కమిషనర్ వెంకట్రావు, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

బాటసారులకు మజ్జిగ పంపిణీ



మజ్జిగ పంపిణీ చేస్తున్న సిద్ధిగణపతి సంఘం సభ్యులు

కిర్లంపూడి: జగపతినగరంలోని అభయ దుర్గమ్మ ఆలయం వద్ద నర్సయ్యపేట గ్రామానికి చెందిన బాల సిద్ధిగణపతి సంఘం ఆధ్వర్యంలో ఆదివారం బాటసారులకు మజ్జిగ పంపిణీ చేశారు. వేసవి నేపథ్యంలో ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు మజ్జిగ పంపిణీ చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో దాడి చిన గోవిందు, యల్లపు లోవ, కాళ్ల ఏసు, కొడేల సతీష్, కొడేల నానాజీ, రాపేటి లోవ, మొల్లేటి వీరబాబు, దాడి బాబీ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ఆరోగ్యం



జి.కొత్తపల్లిలో వాటర్ ట్యాంక్‌ను శుభ్రం చేస్తున్న పంచాయతీ కార్మికులు

శంఖవరం: పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలందరూ ఆరోగ్యంగా ఉంటారని సర్పంచ్ ఈగల విజయదుర్గ అన్నారు. మండలంలోని జి.కొత్తపల్లిలో ఆదివారం ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ నిర్వహించారు. పంచాయతీ సిబ్బంది రోడ్లకు ఇరువైపులా ఉన్న చెత్త, వ్యర్థాలను తొలగించారు. డ్రైన్లలో పూడిక తీసి బ్లీచింగ్ చల్లారు. వీధుల్లో దోమల నివారణ మందు పిచికారీ చేశారు. వాటర్ ట్యాంక్‌లను బ్లీచింగ్ వేసి శుభ్రం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ విజయదుర్గ మాట్లాడుతూ గ్రామం పరిశుభ్రతే లక్ష్యంగా అధికారులు పని చేయాలని సూచించారు.

నూకాలమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తులు

పెద్దాపురం: కాండ్రకోట నూకాలమ్మ అమ్మవారి దర్శనానికి మూడో ఆదివారం భక్తులు పోటెత్తారు. కొత్త అమవాస్య మాసాన్ని పురస్కరించుకుని సుమారు 45 రోజుల పాటు నిర్వహించే జాతర మహోత్సవాల్లో భాగంగా ఆలయ ఈఓ ఆర్.సౌజన్య, ఉత్సవ ప్రత్యేకాధికారి వడ్డి శ్రీనివాస్ ఆధ్వర్యంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నారు. సుదూర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలతో తరలిరావడంతో ఆలయం భక్తులతో కిటకిటలాడింది. పెద్దాపురం సీఐ విజయ్‌శంకర్ పర్యవేక్షణలో ఎస్ఐ మౌనిక ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీస్ బందోబస్తు కల్పించారు.

పల్లెల్లో చెత్త నిర్వహణ

- అక్కరకు రాని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు
- గ్రామ శివార్లలో వ్యర్థాలను తగలబెడుతున్న వైనం
- మురికికూపాలుగా పల్లె రహదారులు పట్టించుకోని అధికారులు



కోటనందూరులో అలంకారప్రాయంగా ఉన్న చెత్త నుంచి సంపద కేంద్రం

కోటనందూరు: పల్లెల్లో పారిశుధ్య నిర్వహణపై ప్రభుత్వ పెద్దలు చేసే ప్రకటనలకు వాస్తవ పరిస్థితులకు పొంతన ఉండడం లేదు. పల్లెలను అద్దంలా తయారు చేస్తున్నామంటూ కూటమి నేతలు స్టేజీలపై ఊకదంపుడు ప్రసంగాలు చేస్తుంటుండగా క్షేత్రస్థాయిలో అపరిశుభ్ర పరిస్థితులు తాండవిస్తున్నాయి. పల్లెల్లో అడుగడుగునా చెత్త, మురుగు దర్శనమిస్తున్నాయి. ప్రధాన వీధుల్లో తొలగించిన చెత్తను గ్రామ శివార్లకు తరలించి వారం లేదా 10 రోజులకొకసారి అక్కడే తగలబెడుతున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. మరోపక్క కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఇళ్ల నుంచి చెత్త సేకరణ జరగడం లేదు. పల్లెలో పారిశుధ్యాన్ని మెరుగుపర్చడంతో పాటు పంచాయతీలకు ఆదాయాన్ని సమకూర్చే లక్ష్యంతో లక్షల రూపాయలు ఖర్చు చేసి పల్లెలో నిర్మించిన చెత్త నుంచి సంపద కేంద్రాలు అలంకార ప్రాయంగా మారాయి. పల్లెల్లో పారిశుధ్య నిర్వహణపై పంచాయతీ కార్యదర్శులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పారిశుధ్య నిర్వహణపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడమే ఈ దుస్థితికి కారణంగా చెబుతున్నారు. పల్లెల్లో మెరుగైన పారిశుధ్య నిర్వహణ జరిగేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని పల్లె వాసులు కోరుతున్నారు.



కాకరాపల్లిలో రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు

17 పంచాయతీల పరిధిలో..

మండలంలో 17 గ్రామ పంచాయతీల పరిధిలో 20 గ్రామాలున్నాయి. ఈ గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ అత్యంత దయనీయంగా ఉంది. ఎక్కడికక్కడ చెత్త దర్శనమిస్తోంది. గ్రీన్ అంబాసిడర్లు కేవలం ప్రధాన రహదారులను శుభ్రం చేయిడానికే పరిమితమవుతున్నారు. సేకరించిన చెత్తను గ్రామ పొలిమేర్లకు తరలించి అక్కడే తగలబెట్టేసి వాతావరణ కాలుష్యాన్ని సృష్టిస్తున్నారు. ముఖ్యంగా మండల కేంద్రం కోటనందూరులో పారిశుధ్య నిర్వహణ అత్యంత దయనీయంగా ఉంది. బస్టాండ్ సెంటర్లో సేకరించిన చెత్తను తాండవ నదికి తరలించి కాల్చుతున్నారు. గ్రామంలో ఎక్కడికక్కడ చెత్త, మురుగు దర్శనమిస్తున్నాయి. తుని-నర్సీపట్నం రోడ్డులో పరిస్థితి మరింత అధ్వానంగా ఉంది.

అలంకార ప్రాయంగా సంపద కేంద్రాలు

రూ.లక్షలు ఖర్చు చేసి గ్రామాల్లో ఏర్పాటు చేసిన చెత్త నుంచి సంపద కేంద్రాలు అలంకార ప్రాయంగా దర్శనమిస్తున్నాయి. గ్రామాల్లో సేకరించిన చెత్తను తడి, పొడి చెత్తలుగా విభజించి కంపోస్టు ఎరువును తయారు చేయడం తద్వారా పంచాయతీలకు ఆదాయాన్ని సమకూర్చాలన్నదే సంపద కేంద్రాల లక్ష్యం. కాగా ప్రస్తుతం సంపద కేంద్రాల్లో చెత్త నిర్వహణ జరగకుండా ప్రభుత్వ లక్ష్యానికి ఆమడ దూరంగా ఉన్నాయి.



తాండవ నది ఒడ్డున కాల్చుతున్న చెత్త

అధ్వానంగా డ్రైనేజీ వ్యవస్థ

పల్లెల్లో డ్రైనేజీ వ్యవస్థ అధ్వానంగా ఉంది. కొన్ని ప్రాంతాల్లో మురుగుకాలువలు లేక ఇళ్లలోని వాడకం నీరంతా రోడ్లపై ప్రవహిస్తోంది. మరికొన్ని ప్రాంతాల్లో ఉన్న డ్రైనేజీల్లో సైతం పూడిక తొలగించకపోవడంతో అందులో మురుగునీరంతా రోడ్లపైకి చేరి అపరిశుభ్ర పరిస్థితులు నెలకొంటున్నాయి. మురికికూపాలుగా మారిన రోడ్లపై ప్రజలు రాకపోకలకు అవస్థలు పడుతున్నారు.

కొరవడిన పర్యవేక్షణ

పల్లెల్లో పారిశుధ్య నిర్వహణ ఎలా జరుగుతుందనే దానిపై అధికారుల పర్యవేక్షణ కొరవడింది. రోజూ ఉదయమే పల్లెల్లో పారిశుధ్య పనులు జరగడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. పంచాయతీ కార్యదర్శులతో పాటు ఉన్నతాధికారులు కూడా పారిశుధ్యాన్ని పెద్దగా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

అధికారులు దృష్టి సారించాలి

పల్లెల్లో పారిశుధ్య నిర్వహణ సక్రమంగా జరగకపోతే ప్రజారోగ్యం దెబ్బతినే అవకాశం ఉంది. ప్రస్తుతం పల్లెల్లో పారిశుధ్య నిర్వహణ అంత మెరుగ్గా లేదు. ఎక్కడకక్కడ చెత్తను కాల్చడం, రోడ్లపై మురుగునీరు ప్రవహించడం ద్వారా వాతావరణ కాలుష్యం ఏర్పడుతోంది. రానున్నది వర్షాకాలం. అధికారులు పక్కా ప్రణాళికతో పారిశుధ్య నిర్వహణ జరిగేలా చూడాలి. ఈ మేరకు తగు చర్యలు తీసుకోవాలి.



జక్కల రామకృష్ణ, బొద్దవరం

టీడీపీలో వర్గపోరు

- సీఎం చంద్రబాబు జన్మదిన వేడుకల్లో బయటపడిన విభేదాలు
- మున్సిపల్ చైర్‌పర్సన్, ఎమ్మెల్యే వర్గం వేర్వేరుగా వేడుకలు



ఏలేశ్వరంలో రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న కౌన్సిలర్లు గోపి, నారాయణస్వామి

ఏలేశ్వరం: సీఎం చంద్రబాబు జన్మదిన వేడుకల్లో భాగంగా పట్టణంలో ఆదివారం టీడీపీలో వర్గ విభేదాలు బయట పడ్డాయి. మున్సిపల్ చైర్‌పర్సన్ అలమండ సత్యవతి తన ఇంటి వద్ద వేడుకలు నిర్వహించగా మున్సిపల్ కౌన్సిలర్లు బొదిరెడ్డి గోపి, మూది నారాయణస్వామి వేరుగా కార్యక్రమం నిర్వహించారు. వీరి ఆధ్వర్యంలో ఏలేశ్వరం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. మాజీ జెడ్పీటీసీ సభ్యుడు జ్యోతుల పెదబాబు తదితరులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ అసెంబ్లీ ఎన్నికలనంతరం చైర్‌పర్సన్ వర్గాన్ని దూరం పెట్టారు. చైర్‌పర్సన్ వర్గం ఎటువంటి అధికారం చెలాయించకుండా ఎమ్మెల్యే తన వర్గమైన కౌన్సిలర్లు బొదిరెడ్డి గోపి, మూది నారాయణస్వామికి పెత్తనం అప్పజెప్పారు. చివరికి నగర పంచాయతీలోనూ చైర్‌పర్సన్‌కు అధికారం లేకుండా చేశారనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో పాటు నగర పంచాయతీలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లోనూ చైర్‌పర్సన్‌ను అధికారులు దూరంగా పెడుతున్నారు. చైర్‌పర్సన్ డమ్మీకాగా ఆమె భర్త వైఖరి నచ్చక ఎమ్మెల్యే వారిని దూరంగా పెట్టినట్టు పార్టీవర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

'ఏకలవ్య' ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ చూపిన కిత్తమూరిపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు



మెట్టచింత గిరిజన పాఠశాల విద్యార్థి మహివర్మ

ప్రత్తిపాడు రూరల్: ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ (గురుకులం) ఫలితాల్లో మండలంలోని కిత్తమూరిపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారని ఎంఈఓ వి.రాజబాబు తెలిపారు. గ్రామానికి చెందిన భూముల రాజేశ్వరి 38వ ర్యాంకు, మాడెం దుర్గాభవాని 208వ ర్యాంకు, లోత అభిరామ్ 233వ ర్యాంకు సాధించారు. మాడెం విజయదుర్గ సంధ్యారాణి ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్‌తో పాటు నవోదయకు ఎంపికైనట్లు తెలిపారు. మెట్టచింత గిరిజన పాఠశాల విద్యార్థి మూర్ల మహివర్మ ఏకలవ్య రెసిడెన్షియల్ స్కూల్‌కు ఎంపికయ్యారన్నారు. వీరికి రాజవొమ్మంగి, అడ్డతీగల ఏకలవ్య రెసిడెన్సియల్‌లో సీట్లు లభించినట్లు తెలిపారు. ఉత్తమ ప్రతిభను కనబరిచిన విద్యార్థులను ఎంఈఓ వి.రాజబాబు, యూటీఎఫ్ మండల అధ్యక్షుడు కోడి శ్రీనివాస్, సీఆర్పీ బాషా, వల్లబాటి వెంకటరాజు, దేవి తదితరులు అభినందించారు.

20 లీటర్ల సారాతో వ్యక్తి అరెస్టు



నిందితుడితో పోలీసులు

రౌతులపూడి: మండలంలోని పారుపాకలో సారా తయారు చేస్తున్న సారా బట్టీలపై రౌతులపూడి ఎస్ఐ బి.వెంకటేశ్వరావు ఆధ్వర్యంలో ఆదివారం పోలీసులు దాడులు చేశారు. ఈ దాడుల్లో అదే గ్రామానికి చెందిన పల్లా లక్ష్మణ్‌ను 20 లీటర్ల సారాతో పట్టుబడ్డాడని ఎస్ఐ తెలిపారు. నిందితుడి నుంచి సారా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు. నిందితుడిని తుని జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరు పరుస్తామన్నారు.

రహదారిపైనే వర్షం నీరు



కాకరాపల్లి శివారులో తుని-నర్సీపట్నం రోడ్డుపై చేరిన వర్షపునీరు

కోటనందూరు: మండలంలోని కాకరాపల్లి శివారు ఇటుకబట్టీల ప్రాంతంలో తుని-నర్సీపట్నం రోడ్డుపై వర్షపునీరు నిలిచిపోతోంది. నిలిచిపోయిన వర్షపునీటితో వాహన చోదకులకు అవస్థలు పడుతున్నారు. గుంతల పూడ్చివేతలో భాగంగా ఆర్ అండ్‌బీ అధికారులు ఇటీవల కాకరాపల్లి శివారులో రోడ్డుకు మరమ్మతులు చేశారు. ఈ ప్రాంతంలో భారీగా వర్షపునీరు నిలిచిపోవడం వల్లే రోడ్డు గుంతలుగా మారి పాడైపోయేది. ఇటీవల రోడ్డుకు మరమ్మతులు చేయించిన ఆర్అండ్‌బీ అధికారులు వర్షపునీటిని రోడ్డు నుంచి పక్కకు పంపించే మార్గం చేయకుండా రోడ్డును బాగు చేశారు. ఇటీవల కురిసిన అకాల వర్షంతో వర్షపునీరు రోడ్డుపై భారీగా నిలిచిపోయింది. దీంతో సమస్య మళ్లీ పునరావృతం అవుతుందని ప్రయాణికులు ఆవేదన చెందుతున్నారు. ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి వర్షపునీరు రోడ్డుపై చేరకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

పార్టీకి పూర్వ వైభవం తీసుకురావాలి

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ గిరిబాబు



గంగవరంలో పార్టీ నాయకులు,కార్యకర్తలతో ముద్రగడ గిరిబాబు, యనమల కృష్ణుడు

రౌతులపూడి: మండలంలో వైఎస్సార్ సీపీకి పూర్వ వైభవం తీసుకురావాలని ఆ పార్టీ ప్రత్తిపాడు నియోజకవర్గ కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు అన్నారు. మండలంలోని గంగవరంలో ఆదివారం బొలిశెట్టి సత్యనారాయణ మనవరాలు పుట్టినరోజు వేడుకలకు తుని నియోజకవర్గ పార్టీ నేత యనమల కృష్ణుడుతో కలసి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా పార్టీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. గ్రామస్థాయిలో పార్టీని పటిష్ట పరచాలని పలు సూచనలు చేశారు. కార్యకర్తలు సమష్టిగా పని చేసి పార్టీని బలోపేతం చేయాలన్నారు. అనంతరం రౌతులపూడిలో ఎస్.పైడిపాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ రిటైర్ అయిన ములగపూడి గ్రామానికి చెందిన యామల చక్రవర్తి ఉద్యోగ విరమణ వేడుకలకు హాజరై శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గొల్లు చినదివాణం, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ సీహెచ్‌వీవీ సత్యనారాయణ, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి రాయి ప్రసాద్, ఉపాధ్యక్షుడు సైపురెడ్డి వెంకటరమణ, సర్పంచులు రాపర్తి రామకృష్ణ, కొరుప్రోలు దేవుడు, సోమరౌతు తిరుమల వెంకన్నదొర తదితరులు పాల్గొన్నారు.

ఫిషర్‌మెన్ సొసైటీ ఎన్నికలపై అప్రమత్తం



కాట్రావులపల్లిలో ఫిషర్‌మెన్ సొసైటీ సభ్యులతో సమావేశమైన ట్రైనీ డీఎస్పీ, పోలీసులు

జగ్గంపేట: కాట్రావులపల్లిలో ఈ నెల 23న ఫిషర్‌మెన్ సొసైటీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు, ట్రైనీ డీఎస్పీ జీవన్, జగ్గంపేట సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి, ఫిషర్‌మెన్ సొసైటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. గ్రామంలో పెట్రోలింగ్ నిర్వహించి డ్రోన్ సహాయంతో అనుమానిత ప్రాంతాలపై గస్తీ పెంచారు. సోమవారం నామినేషన్లు కార్యక్రమం ప్రశాంతంగా జరిగేందుకు ఫిషర్‌మెన్ సొసైటీ సభ్యులు సహకరించాలని సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ కోరారు. ఎవరైనా దౌర్జన్యాలకు దిగినా, ఘర్షణ సృష్టించినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో జగ్గంపేట ఎస్సై రఘునాథరావు, గండేపల్లి ఎస్సై శివ నాగబాబు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

చెరువు.. మురుగునీటికి నెలవు



కలుషిత జలాలకు నిలయమైన ప్రత్తిపాడు గోవిందరాజులు చెరువు

ప్రత్తిపాడు: ఒకప్పుడు ఆ చెరువు నీళ్ల తాగితే సర్వ రోగాలు పోతాయని ప్రజల విశ్వాసం.కాగా ప్రస్తుతం ఆ చెరువులో కాళ్లు కడిగినా సర్వ రోగాలు సంక్రమిస్తాయని ప్రజలు భయపడుతున్నారు. అదే ప్రత్తిపాడు గ్రామం నడిబొడ్డున ఉన్న గోవిందరాజులు చెరువు. పదెకరాల విస్తీర్ణంలో ఉండే ఈ చెరువు క్రమేపీ ఆక్రమణలకు గురైన చిక్కిశల్యమైంది. నిండుగా తామర తూడు, కలువలతో కనువిందు చేస్తున్న ఈ చెరువు మురుగునీటికి నెలవుగా మారింది. ఈ చెరువును కిర్లంపూడి మండలం వేలంక గ్రామ ఫిషర్‌మెన్ సొసైటీ చేపల పెంపకం కోసం లీజుకు తీసుకుంది. కానీ జలాలు కలుషితమవడంతో చేపలు కూడా మృతి చెందిన సంఘటన ఇటీవల చోటు చేసుకుంది. ఓవైపు వేసవి తీవ్రత, మరో వైపు నీరు బయటకు పోయే మార్గం లేకపోవడంతో నీరు కలుషితమవుతోంది. చెరువుకు ఓవైపున కోర్టు, రైతు భరోసా కేంద్రం, సచివాలయం, మరో వైపు వాణిజ్య సదనం, ఇంకో వైపు నాయీబ్రాహ్మణ షాపులు ఉన్నాయి. పంచాయతీ ఎన్నికల సమయాల్లో ఈ చెరువు గట్టును వాకింగ్ ట్రాక్‌గా తీర్చిదిద్దుతామంటూ అభ్యర్థులు హామీలైతే ఇచ్చారు. గద్దె నెక్కిన తర్వాత ఆ హామీలు మరిచారు. చెరువును సుందరంగా తీర్చి దిద్ది, చుట్టూ వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయాలని ప్రత్తిపాడు గ్రామ ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా ఈస్టర్ వేడుకలు

- చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు
- కొవ్వొత్తులతో ర్యాలీలు



జగ్గంపేట శ్మశానవాటికలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

ఏలేశ్వరం: ఏసుక్రీస్తు సమాధి నుంచి తిరిగి రావడాన్ని పురస్కరించుకుని ఆదివారం ఈస్టర్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గ వ్యాప్తంగా ప్రార్థన మందిరాల్లో ఉదయం నుంచి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. జీసస్ గీతాలు ఆలపిస్తూ రోజంతా చర్చిల్లో గడిపారు. స్థానిక కాలేజ్ రోడ్‌లోని లూథరన్ చర్చిలో పాస్టర్ ప్రశాంత్ కుమార్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అధిక సంఖ్యలో విశ్వాసులు, పిల్లలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రశాంత్‌కుమార్ మాట్లాడుతూ పాపులను రక్షించేందుకు క్రీస్తు మళ్లీ జన్మించాడన్నారు. క్రీస్తుబోధనలు అనుసరణీయమన్నారు. స్థానిక ఆర్‌సీఎం చర్చిలో ఫాదర్ థామస్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో యూత్ సభ్యులు, సంఘస్తులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు: మండలంలో ఈస్టర్ వేడుకలను క్రైస్తవ సోదరులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున క్రైస్తవ సోదరులు సమాధులను దేదీప్యమానంగా అలంకరించారు. సమాధుల వద్ద కొవ్వొత్తులను వెలిగించి, ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. చర్చిల్లో పేదలకు కానుకలు, వితంతువులకు వస్త్రాలు అందజేశారు. ప్రత్తిపాడులోని సెంటినరీ బాప్టిస్ట్ చర్చి, బిలీవర్స్ బాప్టిస్ట్ చర్చి, ఎల్ఎఫ్‌టీఎల్, హోప్ మిని స్ట్రీస్, ఆర్‌సీఎం చర్చిల్లో ఈస్టర్ వేడుకలను ఘనంగా నిర్వహించారు.

జగ్గంపేట: మండల పరిధిలోని గ్రామాల్లో ఆదివారం ఈస్టర్ వేడుకలను క్రైస్తవులు ఘనంగా నిర్వహించారు. జగ్గంపేట శివార్లలో శ్మశాన వాటికలకు క్రైస్తవ సోదరులు వెళ్లి తమ బంధువుల సమాధులను పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. కొవ్వొత్తులు వెలిగించి నివాళులు అర్పించారు. అనంతరం నూతన వస్త్రాలు ధరించి చర్చిల్లో ప్రార్థనలు నిర్వహించారు.



ప్రత్తిపాడులో సమాధులను అలంకరించి, ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు



ఏలేశ్వరం ఆర్‌సీఎం చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

వెంకన్న కల్యాణోత్సవాలకు రాట ముహూర్తం



చిల్లంగి వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద పందిరి రాట వేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

కిర్లంపూడి: చిల్లంగిలో వేంచేసిన భూసమేత వేంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవాలకు ఆదివారం శ్రీకారం చుట్టారు. ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు స్వామివారి కల్యాణోత్సవాలకు పందిరి రాట వేశారు. మహిళలు పసుపు దంచారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ స్వామివారి కల్యాణ మహోత్సవాల సందర్భంగా వచ్చే నెల 7 నుంచి 13వ తేదీ వరకు ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, ఊరేగింపు మహోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.